

ముంజంపల్లిలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి



నుస్తులాపూర్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచి రావుల రమేశ్, తదితరులు



చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ

# మహాత్ముడి మార్గం అనుసరణీయం

- ఎంపీపీ ఉమ్మెంతల సరోజన
- ఘనంగా గాంధీ జయంతి



శంకరపట్నం: కొత్తగట్టు జీపీలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ సరోజన, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి

శంకరపట్నం, అక్టోబర్ 2: మహాత్ముడి మార్గం అందరికీ అనుసరనీయమని ఎంపీపీ ఉమ్మెంతల సరోజన, జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో 154వ మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగట్టు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అలాగే పలు గ్రామాల్లో మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, ఎంపీవో బషీరొద్దీన్, సర్పంచ్ మొకిరాల కిషన్‌రావు, ఉపసర్పంచ్ బోడ సంపత్, వార్డుసభ్యులు, టీఆర్ఎస్ నాయకులు ఉమ్మెంతల సతీష్‌రెడ్డి, మోరె శ్రీనివాస్, మనోహర్‌రావు, పరశు రాములు పాల్గొన్నారు.

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 2: మండలంలోని ముంజంపల్లి, కొండపల్కల, చెంజర్ల, గంగిపల్లి, గట్టుదుద్దెనపల్లిలో సోమవారం గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. మానకొండూర్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, నయాబ్ తహసీల్దార్, గిర్దావార్లు, సిబ్బంది ఉన్నారు.

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్2: మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు పలు సంఘాలు, గ్రామ పంచాయతీల్లో మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిగురుమామిడి, అక్టోబర్ 2: చిగురు మామిడి పోలీస్ స్టేషన్లో ఎస్‌ఐ సామల రాజేశ్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రేకొండ, చిగురుమామిడి, కొండాపూర్‌లో సర్పంచులు పిట్టల రజిత, బెజ్జంకి లక్ష్మణ్, పెద్దపల్లి భవానీ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీ కొత్తూరు సంధ్య, వివిధ పార్టీల మండలాధ్యక్షులు మామిడి అంజయ్య, దుడ్డెల లక్ష్మీనారాయణ, మిలీనియం యూత్ సభ్యులు లంకసిరి శ్రీనివాస్, తిప్పారపు సురేశ్, దుడ్డెల శ్రీనివాస్, గందె చిరంజీవి, అప్పాల రమేశ్, పరుపాటి మహిపాల్‌రెడ్డి, చాడ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్, అక్టోబర్ 2: ఎన్‌జీపీఎస్‌వో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలు సోమవారం మానకొండూర్ మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బొద్దుల శ్రావణ్, సభ్యులు దేశరాజు రాజు, వేల్పుగొండ మొగిళి, నాగాంజనేయులు, సాయికుమార్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.



రేకొండలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచ్, మహిళలు



మానకొండూర్: గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

## రేకొండలో యూత్ క్లబ్ ఆర్థిక సహాయం

చిగురుమామిడి, అక్టోబర్ 2: మండలంలోని రేకొండ గ్రామంలో సంగం బాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వారి కుటుంబానికి గ్రామానికి చెందిన బాలమిత్ర ఫ్రెండ్స్ అసోసియేషన్ రేకొండ ఆధ్వర్యంలో సోమవారం రూ.10 వేల నగదు, 25 కిలోల బియ్యం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇక్కడ బాలమిత్ర ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కెమ్మసారం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కటుకోజ్వల రామమూర్తి, ఉపాధ్యక్షులు తీగల రమేశ్, కార్యవర్గ సభ్యులు చెంచల జగత్, చందవేణి తిరుపతి, గొడిశాల సురేశ్, కుంట శ్రీనివాస్, మామిడి సంపత్ ఉన్నారు.



మృతుడి కుటుంబానికి నగదు అందజేస్తున్న యూత్ క్లబ్ సభ్యులు

## ఎస్ఈ కార్యాలయంలో అందుబాటులోకి మీటింగ్ హాల్

- వర్చువల్‌గా ప్రారంభించిన ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు

ముకరంపుర, అక్టోబర్ 2: ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీఎస్ ఎన్పీడీసీఎల్) కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో నూతన సమావేశ మందిరం అందుబాటులోకి వచ్చింది. గతంలో కరీంనగర్ రూరల్ ఈఆర్వోగా ఉన్న కార్యాలయాన్ని రినోవేషన్ చేసి సమావేశ మందిరంగా తీర్చిదిద్దారు. సర్కిల్ పరిధిలో నిర్వహించే సమావేశాలను ఇకపై ఇక్కడి సమావేశ మందిరం నుంచే నిర్వహించేలా సౌకర్యాలు కల్పించారు. ఈ మేరకు కరీంనగర్‌లోని మీటింగ్ హాల్‌ను హన్మకొండలోని ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు వర్చువల్‌గా ప్రారంభించి మాట్లాడారు. అన్ని హంగులతో అందుబాటులోకి తీసుకువచ్చిన మీటింగ్ హాల్ ఉద్యోగులకు అన్ని విధాలా సౌకర్యంగా ఉంటుందని, సమావేశాలతో పాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించవచ్చున్నారు. అలాగే గంగాధర మండలం ఒద్యారంలో నూతనంగా నిర్మించిన 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను సోమవారం ఎన్పీడీసీఎల్ అన్నమనేని గోపాల్‌రావు స్కాడా సిస్టం ద్వారా ప్రారంభించారు. ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో మొదటిసారిగా ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. నూతనంగా నిర్మించిన ఒద్యారం సబ్‌స్టేషన్‌లో మొదటిసారిగా స్కాడా సిస్టంను వినియోగించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు(హెచ్‌ఆర్డీ పీఅండ్ఎంఎం) బీ వెంకటేశ్వరరావు, డైరెక్టర్(ఐపీసీ ఆర్‌ఏసీ) పీ గణపతి, డైరెక్టర్(కమర్షియల్) పీ సంధ్యారాణి, సీజీఎంలు బీ అశోక్‌కుమార్, టీ సదర్‌లాల్, మోహన్‌రావు, మధుసూదన్, కిషన్, సి.ప్రభాకర్, రాజుహన్, భీకంసింగ్, ఎస్ఈ అంకూస్, ఈఈ వెంకటేశ్వర్లు, జీఎం(ఐటీ) శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రటరీ రమణారెడ్డి, కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వీ గంగాధర్, డీఈలు విజయేందర్‌రెడ్డి, రాజం, తిరుపతి, చంద్రమౌళి, గోపికృష్ణ, కాళిదాసు, లక్ష్మారెడ్డి, ఏడీలు, యూనియన్లు, అసోసియేషన్ల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మీటింగ్ హాల్‌ను ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎండీ గోపాల్‌రావు

## ట్రాక్టర్‌పై నుండి పడి కూలీ మృతి



రాము(ఫైల్)

గంగాధర, అక్టోబర్ 2: ప్రమాదవశాత్తూ ట్రాక్టర్‌పై నుంచి పడి కూలీ మృతిచెందిన సంఘటన మండలంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం ప్రకాం.. మండలకేంద్రానికి చెందిన సంపంగి రాము(29) కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. సోమవారం ఉదయం బండ తేవడానికి ఇతర కూలీలతో కలిసి ట్రాక్టర్‌పై వెళ్లాడు. ట్రాక్టర్ నాగిరెడ్డిపూర్ గ్రామ శివారుకు చేరుకున్న సమయంలో ప్రమాదవశాత్తూ ట్రాక్టర్‌పై నుంచి కింద పడగా ట్రాలీ టైర్ పైనుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి కూలీలు రామును కరీంనగర్ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అభిలాష్ తెలిపారు.

## హెడ్ కానిస్టేబుల్‌పై కత్తితో దాడి

- కుటుంబవిషయాల్లో జోక్యం చేసుకుంటున్నాడనే కక్షతో దాడి

రాంనగర్, అక్టోబర్ 2 : తన కుటుంబ విషయాల్లో జోక్యం చేసుకుంటున్నాడనే కక్షతో మద్యం మత్తులో ఓ వ్యక్తి హెడ్ కానిస్టేబుల్‌పై కత్తితో దాడి చేసిన ఘటన కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న నెల్లి శ్రీనివాస్ బొమ్మకల్ సిటిజన్ కాలనీలో ఉంటున్నాడు. ఆ ఇంటికి సమీపంలో ఉంటున్న పిట్టల వెంకటేశం, కుటుంబంతో సహా కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. తరచూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. దీంతో వెంకటేశం భార్య శ్రీనివాస్ దగ్గరికి వచ్చి సమస్యను పరిష్కరించాలని కోరేది. దీంతో గొడవ వద్దని శ్రీనివాస్ సూచించడంతో, తన కుటుంబ విషయంలో జోక్యం చేసుకుంటున్నాడని శ్రీనివాస్‌పై కోపంతో పిట్టల వెంకటేశం సోమవారం తెల్లవారుజామున ఇంటికి వచ్చి కత్తితో దాడి చేశాడు. అడ్డుకోబోయిన అతడి సోదరుడు కొమురయ్య, కుమారుడు శివకృష్ణపై కూడా దాడి చేశాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. శ్రీనివాస్ కుమారుడు శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు.

## గుండెపోటుతో వ్యాపారి మృతి



మొగిలయ్య(ఫైల్)

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 2: హుజూరాబాద్ పట్టణంలో ప్రసిద్ధి చెందిన అన్నపూర్ణ మెస్ అండ్ లాడ్జి వ్యవస్థాపకుడు బొల్లం మొగిలయ్య సోమవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఇటీవల అనారోగ్యానికి గురికాగా దవాఖానలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. ఉదయం ఒక్కసారిగా ఛాతిలో నొప్పి లేవడంతో దవాఖానకు తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మొగిలయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మొగిలయ్య మృతి పట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మలాశ్రీనివాస్, కౌన్సిలర్లు వెన్నంపల్లి కిషన్, తోట రాజేంద్రప్రసాద్, తొగరు సదానందం, ముక్క రమేశ్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

## అంగన్‌వాడీల ఆనంద హేల

- పీఆర్సీ వర్తింపు ప్రకటనపై హర్షం

కలెక్టరేట్, అక్టోబర్ 2: సీఎం కేసీఆర్ అంగన్‌వాడీ టీచర్లపై వరాలు కురిపించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిన్న పదవీ విరమణ ప్రయోజనాల పెంచగా, తాజాగా పీఆర్సీ కూడా వర్తింపజేయనున్నట్లు, పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులు కూడా విడుదల చేస్తున్నట్లు ప్రకటించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్లుగా తాము పడ్డ కష్టానికి సీఎం కేసీఆర్ ప్రతిఫలం అందిస్తున్నాడంటూ కీర్తిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని 777 అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న 762మంది టీచర్లు, 700కు పైగా ఆయాలకు లబ్ధి చేకూరనున్నది. ఉమ్మడి పాలనలో ఏ రాజకీయ పార్టీ, అధికారంలో ఉన్న ఏ ముఖ్యమంత్రి కూడా అంగన్‌వాడీ కేంద్రాలను పట్టించుకోలేదని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో అంగన్‌వాడీలు బలోపేతమయ్యాయని పేర్కొంటున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రూ.3,500 మాత్రమే గౌరవ వేతనం అందుకున్న అంగన్‌వాడీలకు, స్వరాష్ట్ర పాలనలో సీఎం కేసీఆర్ రెట్టింపు చేశారని చెబుతున్నారు. పలు దఫాలుగా మొత్తంగా రూ.13,650 వరకు వేతన పెంచారన్నారు. తాజాగా మరోసారి రూ.4వేల పైచిలుకు వేతనం పెరుగనుండగా, రూ.17వేల పైగానే వేతనం అందుకోనున్నారు. దీనికి తోడు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కూడా వర్తింపజేయనుండగా, టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ. 50వేలు ఏకమొత్తంలో అందనున్నాయి. వయోపరిమితి 65 ఏండ్లకు పెంచడం, విధులు నిర్వహిస్తూ మరణిస్తే టీచర్లకు రూ.20వేలు, ఆయాలకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. పదవీ విరమణ చేసిన మరుసటి నెల నుంచే ఆసరా పింఛన్ కూడా వర్తింపజేసేందుకు నిర్ణయించడంపై అంగన్‌వాడీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబాల పట్ల సీఎం కేసీఆర్ చూస్తున్న చల్లని చూపునకు నిదర్శనమంటున్నారు.